
# ఓ సుబ్బారావు కథ



'కౌశిక'

ఆ ఊరికి నాకు కొత్తగా బదిలీఅయింది.

“రైలుస్టేషన్ దగ్గరికొచ్చి మిమ్మల్ని సుబ్బారావ్ రిసీవ్ చేసుకుంటాడు. మీకెలాంటి లోపం రానీయడు. మీరే చూస్తారుగా! సుబ్బారావుకు అక్కడ ఎంత పలుకుబడి ఉందో” అని రైలెక్కించాము-

నాకూ-సుబ్బారావుకు మధ్య వారధిలా ఉండి సారథ్యం నిర్వహిస్తున్న సారధి.

నే నింకా రెండు మూడు రోజులకు ఆ వూరికి వెళతాననగా - సుబ్బారావు గురించి సీరియల్ నవలలాగా చెప్పడం మొదలు పెట్టాడు సారధి.

"సుబ్బారావుకు రాజమండ్రిలో ఎంత పలుకుబడి ఉందంటే"- సారధే మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు. "ఓ సారి గ్రీన్ సిగ్నలిచ్చి ప్లాటుఫాంనుండి కదలడానికి సిద్ధంగా ఉన్న రైలును- మా సుబ్బారావు తన పలుకుబడి నుపయోగించి అరగంట ఆపగలిగాడు. అదీ ఈరోజుల్లో గాదు. బ్రిటీషువారి కాలంలో - అని చెపుతూ మధ్యలో ఆగి- నేను ఆశ్చర్య చకితుణ్ణై అతను చెబుతున్నది వింటూన్నదీ లేందీ గమనించడానికా అన్నట్లు నావైపు తిరిగి ఓరగా చూశాడు.

"అసలది ఎలా జరిగిందంటే" సారధే మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు

"ఓసారి సుబ్బారావు- మామగారిసీ. భార్యాబిడ్డల్ని రైలెక్కించడానికి రైల్వే స్టేషనుకు తీస్కెళ్ళాడట - మామగారు వాళ్ళు కంపార్టుమెంటులో కెక్కి అన్నీ సర్దుకున్న తరువాత- తీరా గ్రీన్ సిగ్నలిచ్చే సమయానికి- ఆయన మామగారికి తన ముఖ్యమైన మందుసీసా ఒకటి ఇంటిదగ్గర మరచిపోయానని గుర్తుకొచ్చి - అదే విషయం సుబ్బారావుతో అన్నాడు.

"ఇంకేముంది! సుబ్బారావు వెంటనే రైల్వేగార్డు, స్టేషను సూపరింటెండెంట్ మొదలైన పెద్దలందర్నీ కలిసి - అందరికీ ఒక్కొక్కరికి డజనుసార్లు నమస్కారంచేసి - తమ పూర్వస్నేహాన్ని వారికి గుర్తుచేసి గడిచిన కాలంలో వారందరికి ఏ విధంగా తాను శ్రీరాముడికి ఆంజనేయుడిలా సహాయం చేసింది జ్ఞాపకం చేసి- తన మామగారు మందు తెచ్చుకోవడానికి ఇప్పుడే గుఱ్ఱబ్బండిలో వెళ్ళాడని- అరగంటలోపు తప్పకుండా వస్తాడని- అంతవరకు రైలాపవలసిందని అభ్యర్థించాడట. స్టేషన్ సూపరింటెండెంటుకు గార్డుకు తప్పింది గాదు.

"సుబ్బారావు మాట తోసిరాజనలేక రైలును, ప్లాటుఫాంమీద అలాగే అరగంట నిలిపివేశారట."

"గ్రీన్ సిగ్నలిచ్చింతరువాత రైలు ఇంతసేపు ఆగిందేం!" అని ప్రయాణీకులు కురిపించిన ప్రశ్నల వర్షానికి తట్టుకోలేక, 'ఇంజన్‌లో కొంచెం ట్రబులొచ్చింది. అది బాగుపడగానే బయలుదేరుతుంది' అని సర్ది చెప్పారట.

"ఇంతలో సుబ్బారావు మామగారు మందుసీసా తీస్కొని రావడం, రైలుపెట్టెలోకి ఎక్కి తనసీట్లో సర్దుకొని కూర్చున్న తరువాత రైలు కదిలింది."

"చూశావా మరి! అదీ మా సుబ్బారావు ప్రతాపమంటే! అంత పలుకుబడి మీకూ- నాకూ రమ్మంటే వస్తుందా!" అని బెదర

గొట్టాడు సారథి నాకు సుబ్బారావు అమోఘశక్తిసామర్థ్యాలను గురించి చెప్పి.

"మరోసారేం జరిగిందో తెలుసా? అప్పుడు నిత్యావసర వస్తువుల మీద కంట్రోలు బాగా అమలుజరుపుతున్న రోజులు. చచ్చి "గీ" పెట్టినా ఓ కిలో పంచదార అదనంగా ఇవ్వమంటే ఇచ్చే వారు కాదు. అలాంటి గడ్డురోజుల్లో సుబ్బారావు ఆఫీసర్‌గారికూతురి వివాహం నిర్ణయమైంది. ఎలా? పెళ్ళికి కనీసం ఐదుబస్తాల పంచదారైనా కావాలి. ఏం చేయాలి అని పాలుబోక అందరూ చేతులు పిసుక్కుంటున్నారు. వెంటనే వాళ్ళకు మన సుబ్బారావు జ్ఞాపకమొచ్చాడు. ఇంకే ముంది. ఆఫీసరు వెంటనే సుబ్బారావును తనఇంటికి పిలిపించి— 'చూడు సుబ్బారావూ! ఈ పని నీ వొక్కడివల్లా తప్ప మరెవరివల్లా సాధ్యంకాదు - బాబ్బాబు! ఇవి చేతులుకావు కాళ్ళనుకో! ఎలాగైనా సరే ఈపని నీవు సాధించిపెట్టాలి'- అని ఒకటే ప్రాధేయపడ్డాడట.

"అంతే! సుబ్బారావు ఆఫీసరుతో అలా ఓ అరగంట అలాగే బతిమాలించుకుని— ఆ తరవాత— 'ఈ పని నా కొదిలెయ్యండి నేను చూస్కుంటాను' అని అభయ హస్తమిచ్చాట్ట. అప్పుడుగాని వాళ్ళు 'హమ్మయ్య! ఈ గండం ఇలా గడిచిందిగదా' అని గుండెలమీద చేయి వేస్కుని పడుకున్నారట."

"అయితే ఆ పని సుబ్బారావు సాధించగలిగాడా" అని నేను అమాయకంగా అడిగాను సారధిని.

"ఏమిటా పిచ్చి ప్రశ్న. సుబ్బారావు సాధించలేకపోవడమేమిటి నిక్షేపంగా— పెళ్ళినాటికంటే వారంరోజులు ముందుగానే ఐదుబస్తాల పంచదార ఆఫీసరుగారింట్లో— తానే స్వయంగా ఎడ్లబండి మాట్లాడి - తీస్కొచ్చి - ఇంట్లో పడేయించి— మరీ వెళ్ళాడు— ఏమనుకున్నావో? ఏమో? అన్నాడు.

"సారధీ! నీవు కోప్పడనంటే నాది మరో ప్రశ్న. సుబ్బారావుకు ఇలాంటి అమోఘమైన శక్తులు ఎలా అబ్బాయంటావు" అతని దగ్గర మంత్ర— తంత్ర — ఆకర్షణవిద్య - టక్కు - టమారం లాంటివి— ఏమైనా ఉన్నాయంటావా."

"అలాంటివేమీ లేవుగాని - అతనికి అవతలవాణ్ణి ఎలా పడేయాలో బాగా తెలుసు. అతని దగ్గర దాని క్కావాల్సిన కొన్ని చిట్కాలున్నాయ్."

"బాబ్బాబూ! అదేమిటో కాస్త చెప్పు— వీలైతే నేనూ పాటిస్తాను. ఎందుకంటావా? ఎప్పుడూ మా ఆవిడ నన్ను దెప్పిపొడుస్తూ ఉంటుంది. మీరు ఏ పనీ సాధించలేరని! నేను కార్యసాధకుణ్ణి కానని మా ఆవిడ నన్ను ఎన్నిసార్లన్నదో చెప్పలేను— కనీసం సుబ్బారావు వేసే చిట్కాలైనా పాటించి— మా ఆవిడ మెప్పుపొందాలని నా యాతన" అన్నాను,

నా మనసులో ఉన్న కోరికను బయట పెడుతూ!

సారధి సర్దుక్కూర్చుని - శౌనకాది మునులకు సూతపౌరాణికుడిలా చెప్పడం మొదలెట్టాడు.

సుబ్బారావుకు ఏదైనా ఆఫీసులో పని కావాల్సి ఉంటుందనుకో, ఆ ఆఫీసుకు రెండుమూడు నెలలు ముందుగానే రాకపోకలు ప్రారంభిస్తాడు. ఆ ఆఫీసులో బంట్రోతు- వాచ్‌మన్ దగ్గర్నుంచి - పెద్ద ఆఫీసర్ వరకు- వాడు- వీడనే తారతమ్యం లేకుండా అందరికీ నమస్కారాలు పెట్టడం ప్రారంభిస్తాడు. దాంతో వాళ్ళతో పరిచయం ఏర్పడుతుంది. ఆ తరువాత తనకు ఏ వ్యక్తితో పనుందో- అతని ఇంటికి వెళ్ళి ఒకటి రెండు సార్లు కలుసుకొని - పండ్లు - ఫలాలు-నెయ్యి- నూనె- ఆ ఆఫీసరుకి ఏదవసరమైతే అది- ఈ ప్రపంచంలో దొరికేది ఏదైనా సరే సప్లై చేస్తాడు. దాంతో ఆఫీసరు ప్రసన్నుడై "బాబూ! నేను నీకు ఎలా ప్రత్యుపకారం చేయగలను- అని అన్నా- అనకున్నా- అన్నట్టుగా ముఖం పెట్టాడు.

"అప్పుడు మా సుబ్బారావు "ఆ! దాందేముందండి. ప్రతిదీ మనం ఫలాపేక్షతో చేస్తామా? గీతలో కృష్ణభగవాను డేమని చెప్పాడు- 'కర్మచేయడం నీవంతు-దాని ఫలితాన్ని నాకు వదిలెయ్' అని చెప్పలేదూ! అలాగే మనలో ప్రతివక్కరూ ప్రతిఫలాపేక్ష లేకుండా- నిష్కామకర్మ చేస్తూ ఉండాలి." అని తనకు తెలిసిన ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని- అతి లౌకికంగా ఉపయోగించుకొని-ఆ ఆఫీసులో తనంటే ఓ రకమైన గౌరవప్రతిష్ఠలు కలిగేట్టు చేసుకుంటాడు.


"అలా వారిద్దరిమధ్య పరిచయాలైన తరువాత - ప్రతీ పండగ- పబ్బానికీ గ్రీటింగ్స్ కార్డ్సు పంపించడం - వారి కుటుంబంలో ఎవరైనా ఊరెళుతూంటే రిజర్వేషను చేయించడం - వగైరా - చిన్నవీ- పెద్దవీ- అనుకోకుండా అన్ని పనులు చేసిపెడుతూ ఉంటాడు.

చివరికి ఆ ఆఫీసరుగారి భార్యతో కూడా పరిచయం పెంచుకొని- ఆవిడతో- 'అన్నయ్యగారూ! చాలా రోజులుగా మీరు కనిపించడం లేదేం! ఇంట్లో అంతా కులాసాయేనా?' అని అడిగించుకొనేవరకు వెళతాడు.

ఇక వాళ్ళు సుబ్బారావు అడిగిన పనులు చేయక చస్తారా?" ఇప్పుడు చెప్పు అన్నట్టు - ముక్తాయింపుగా కొంచెంసేపు ఆగి నావైపు సాలోచనగా చూశాడు.

"అయితే సారధీ! చెప్పిన ఈ పను అన్నీ చేయడానికి సుబ్బారావుకు ఎంతో డబ్బు - సమయం అవసరం కదా! అవన్నీ ఎక్కడ్నుంచి వస్తాయంటావు" అన్నాను.

"అదిగో! అది మరో పిచ్చిప్రశ్న! సుబ్బారావు ముఖ్యవృత్తే అది. కాబట్టి తనకున్న సమయాన్నంతా ఇలా సద్విని




యోగం చేస్కుంటాడు. ఇక డబ్బం టావా? ఎవరో నీలాంటివాళ్ళు నాలాంటి వాళ్ళు- ఉద్యోగాలిప్పించమనో- ఫలానా చోటికి ట్రాన్స్‌ఫరు చేయించమనో- ఫలానా ట్రాన్స్‌ఫరు కాకుండా చేయించమనో- డబ్బిస్తారు గదా! దాన్ని అతడు జాగ్రత్తగా సద్వినియోగం చేసుకుని- వారి పనులు చేసి పెడుతూంటాడు.

"అంటే కాళ్ళా - వేళ్ళా పడి మీ సుబ్బారావు పనులు చేయించి పెడతాడన్న మాట"

"అదిగో! అక్కడే నీవు పప్పులో కాలేశావు. సుబ్బారావును కలుసుకోవడానికి నీవు వెళ్ళు. అప్పుడు నీకే తెలుస్తుంది అతని సంగతి.

అతని ఇంటి నిండా- పెద్ద పెద్ద ఆఫీసర్లతో- రాజకీయ నాయకుల్తో తీయించుకొన్న ఫోటోలు- సన్మాన పత్రాలు- మెమెంటోలు- రక రకాల ఆఫీసర్ల టెలిఫోను నంబర్లు- అడ్రసులు అతనింట్లో రెండు ఫోనులు- బ్రహ్మాండంగా ఉంటూంది.

సుబ్బారావు దర్శనం కావాలంటేనే నీకు వారంరోజులు పడుతూంది. ఒక వేళ అతని దర్శనమైనా- అతనితో మాట్లాడ్డం చాలా కష్టం- ఏ విషయం గురించైనా- అనర్గళంగా-ఎన్నిగంటలైనా,నాన్ స్టాప్‌గా మాట్లాడగలడు- వాక్ప్రవాహం అమోఘం.

అతను అసలు విషయానికొచ్చేసరికి కనీసం రెండుమూడు గంటలైనా పడుతూంది. అసలువిషయానికొచ్చింతరువాత గూడా అతన్ని కన్విన్స్ చేయడం మరీ కష్టం- మనం మర్యాదగా మాట్లాడితే- అతనా కటువుగా మాట్లాడతాడు. మనం కటువుగా మాట్లాడితే అతను నెమ్మదిగా మాట్లాడతాడు. మనం అవుతూందంటే అతను కాదంటాడు. మనం కాదంటే

అతనొనంటాడు. ఇంతెందుకు! ఒకసారి అతన్ని కలుసుకుంటే- అతనికి గల రాజకీయ ధురంధరత- చాకచక్యం- లౌకిక ప్రజ్ఞలు మీకే అర్థమౌతాయి" అని సుబ్బారావు ప్రజ్ఞాపాటవాల పరిచయ పాఠాన్ని ముగించాడు సారధి.

రైలు రాజమండ్రి స్టేషను దగ్గర పడుతూన్నది. సుబ్బారావు గురించి సారధి చెప్పిన మాటలు నాకింకా జ్ఞాపకమొస్తూనే ఉన్నాయి. పెట్టే-బేడా సర్దుకొని-లుంగీ విడిచి పాంటు వేసుకుని- దిగడానికి సిద్ధమయ్యాను. ఇంతలో రాజమండ్రి స్టేషన్ రానేవచ్చింది.

సూటుకేసు తీసుకుని కిందికి దిగాను సుబ్బారావుకోసం కొంచెంసేపు అలాగే ఉన్నచోటనే నిల్చున్నాను. కాని సుబ్బారావులాంటి మనిషెవరూ కన్పించలేదు.

సుబ్బారావు రూపురేఖావిలాసాదుల గురించి సారధి చెప్పిన గుర్తులు మననం చేసుకున్నాను బాగా పొడవైన మనిషి. పచ్చటి విగ్రహం. ఉంగరాల జుత్తు. నోట్లో ఫారిన్ సిగరెట్టు, కూలింగ్ గ్లాసెస్.

అలాంటి మనిషెవరూ కన్పించలేదు.

కాని కొంచెంసేపటి తర్వాత___ ఓ పాతికేళ్ళకుర్రవాడొచ్చి,"హైద్రాబాదు నుంచి వస్తూన్న మల్లిక్‌గారు మీరేనాండి" అని పలకరించాడు.

అవునన్నట్లుగా తల ఊపాను.

"అయితే వెళదాం పదండి-నాన్నగారు మీ కోసం హోటల్లో రూం బుక్‌చేశారు. అర్జంటుగా ఎవరో ఆఫీసరు కబురు పెడితే వెళ్ళారు. మిమ్మల్ని రిసీవ్ చేసుకోవడానికి నన్నుపంపించారు." అన్నాడు.

"థ్యాంక్యూ వెరీమచ్" ఇక వెళదామా అన్నాను. ఆ మరుసటిరోజే ఆఫీసులో జాయినింగ్ రిపోర్టిచ్చాను.

చూస్తూండగానే రాజమండ్రిలో అర్నెల్లు గడిచాయి. సుబ్బారావుతో నా స్నేహం బాగా గట్టిపడింది.

ఓ రోజు ఇద్దరం గోదావరి ఒడ్డున కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం నేనే టాపిక్ మొదలుపెట్టాను.

"సుబ్బారావుగారూ! మీ ప్రజ్ఞ అమోఘం. మీ కున్న పలుకుబడికి నేను ఆశ్చర్యపడని రోజులేదంటే నమ్మండి" అన్నాను.

"ఆం ఏం పలుకుబడిలెండి. చూసిన వాళ్ళకాళ్ళు పట్టుకోలేక నా దుంపతెగుతున్నదనుకో- ప్రతివాడు ఏదో ఒక పని గురించి వచ్చి ప్రాధేయపడతాడు. ఆ వచ్చినవాడి పని నెత్తినేసుకొని నేను ఊరంతా తిరగడం- ఆ పని అయితే అప్పగించినవాడు అసలు కన్పించడు. కాకపోతే ఇంటికొచ్చి తిట్టిపోతాడు!

"ఇహ ఆఫీసర్ల సంగతంటారా! అషాఢభూతుల్లాంటివాళ్ళు, ఎంత డబ్బిచ్చినా- ఎన్ని ఫేవర్సు చేసినా- మన అవసరం పడివెళితే-కొత్తవాణ్ణి చూసినట్లే చూస్తారు- దాంతో పనులు చేయించడం

రోజురోజుకూ ఓ గడ్డుసమస్యగా మారి పోతున్నది.

ఊళ్ళోవాళ్ళందరి పనులు చేయించడంతో నా పనులుచెడిపోతున్నాయనుకో. నా పలుకుబడి చూచి మన ఆఫీసులో వాళ్ళకు నేనంటే చచ్చే జెలసీ."

అని సూక్ష్మంగా తన సాధక-బాధకాలు ఏకరువుపెట్టాడు సుబ్బారావు.

ఎప్పుడూ కళకళలాడుతూ ఉండే వాడల్లా ఓ రోజు సుబ్బారావు ముఖం చిన్నబోయి దిగాలుగా కన్పించాడు.

"సుబ్బారావుగారూ! ఎప్పుడూ ఆనందంగా ఉండే మీరు ఈ రోజు డల్‌గా ఉన్నారేమిటి అని అడిగాను.

"ఏమీలేదు మల్లిక్!" మన బాస్‌కు నేనెంత సహాయం చేశానో నీకు తెలుసుగా! ఎన్ని రకాల సహాయపడ్డానో నీకు తెలియంది గాదు. అలాంటి నాకు ఈ సంవత్సరం సి.ఆర్స్‌లో "యావరేజ్" అని వ్రాశాడు. చెప్పుడుమాటలు విని అలా చెయ్యొచ్చా! నీవే చెప్పు" అని తన కష్టాన్ని నా ముందు వెళ్ళబోసుకున్నాడు సుబ్బారావు.

"చూడు మల్లిక్! ఇలాంటి ఆఫీసర్ల దగ్గర పనిచేసేదానికంటే శక్తుంటే ఏదైనా స్వంత వ్యాపారం పెట్టుకోవడం మంచిది. అప్పుడు మన ప్రతిభేమిటో చూపించవచ్చు" అన్నాడు.

సుబ్బారావు చెప్పిందాంట్లో నిజముందనిపించింది. అవకాశవాదులైన ఆఫీసర్లకు అడుగులకు మడుగులొత్తిందానికంటే ఏదైనా కిళ్ళీకొట్టు పెట్టుకొన్నా పైకి రావచ్చు.

కాని నా కర్థంకానిదల్లా ఒకటే! అంతమంది కొమ్ములు తిరిగిన వాళ్ళనే పడేసిన మా సుబ్బారావు తన స్వంత విషయంలో ఎందుకు విఫలుడయ్యాడా అని.

ఏది ఏమైనా సుబ్బారావంటే నాకు ఇప్పటికీ గౌరవమే. ఎందుకంటారా? అతనిలో కొంచెం 'ఈగో' ఉన్నా-ఎంతమందికో ఎన్ని రకాలుగానో ఉపయోగపడ్డాడు. ఉపకారాలు చేశాడు. మరి వాళ్ళ డబ్బు ఖర్చు కాలేదా? అంటారేమో? అయితే అయింది. మన డబ్బు ఖర్చుపెట్టి మనకు ఉపకారం చేసిపెట్టే వాళ్ళు ఎంతమంది ఉన్నారు చెప్పండి ఈ నవ నాగరిక ప్రపంచంలో. ఉద్యోగాలిప్పిస్తామని డబ్బు మింగి కాజేసేవాళ్ళు. ఫారిన్ పంపిస్తామని బ్రోకరేజి చేసే వాళ్ళు- ఉద్యోగాలకోసం ఆడవాళ్ళను తమ చుట్టూ తిప్పించుకొని- చివరకు డబ్బును శీలాన్ని హరించే ప్రబుద్ధులు- దొంగ కంపెనీలను పెట్టి రాత్రికి రాత్రికి ఉడాయించేవాళ్ళు- పైకి డాబుగా- పెద్ద వాళ్ళుగా చలామణి అయ్యే ఎందరో సోషల్ విలన్లతో పోల్చుకుంటే- మా సుబ్బారావు నాకంటికి దేవుళ్ళా కనిపిస్తాడు.

—